ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను విడుదల చేయాలి


బీజేపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సుధాకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిండి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజ్రీవాల్‌ను సీబీఐ చేత అరెస్టు చేయించడాన్ని నిరసిస్తూ ఆమ్ ఆద్మీపార్టీ ఆధ్వర్యంలో శనివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ అరెస్టు చేసి జైలుకు పంపగా ఈనెల 20న బెయిల్ లభించిందని, మరుసటి రోజే సీబీఐ అరెస్టు చేయడం, బెయిల్‌కు వ్యతిరేకంగా స్టే తీసుకురావడం చూస్తే కేజ్రీవాల్‌ను జైలు నుంచి బయటకు రాకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నారని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులను పోలీసులు అడ్డుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, ఎండీ మజీద్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ, యువజన విభాగం అధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రీన్ డే


గ్రీన్ డేలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గోల్కొండ: సబ్జిబండి శాంతినికేతన్ పాఠశాలలో గ్రీన్ డేను సంబరంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కె.శశిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పచ్చరంగుల విశిష్టతలను తెలిపే చిత్రాల పోస్టర్లను తయారు చేసి అబురపరిచారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శశిపాల్‌రెడ్డి మాట్లాడుతూ..ఆకుపచ్చరంగు సకల జీవకోటికి సంబంధించిందన్నారు. మన జీవితాలపై ఆకుపచ్చరంగు సానుకూల ప్రభావాలు చూపెడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం

లంగర్‌హౌస్: త్రివేణి సంగంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చారిత్రాత్మక మఠ దేవాలయం జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామికి, పంచముఖ అంజనేయస్వామికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయునికి సింధూర లేపనం, తమలపాకుల పూజలు చేసి, రాంలీలా మైదానంలో అన్నదానం చేశారు.


అన్నదాన కార్యక్రమంలో రాహుల్‌దాస్ బాబా

మజ్లిస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి


మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస నాయకులందరూ తమ ప్రాంతంలోని ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో గోల్కొండ, టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్‌కు చెందిన మజ్లిస్ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ సీనియర్ నాయకులతో పాటు మజ్లిస్ ఏరియా కమిటీ సభ్యులందరూ ప్రతినిత్యం క్రీయాశీలకంగా ఉండాలని స్పష్టం చేశారు. టోలిచౌకీ, గోల్కొండ డివిజన్‌లలో భారీ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని దీన్ని వల్ల ఎండిలైన్స్ చౌరస్తా, కంపెనీ బాగ్, టోలిచౌకీ చౌరస్తా, టూమ్స్ రోడ్ తదితర ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆయన అన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగడం, చెత్త కుప్పలు పేరుకుపోవడం లాంటి సమస్యలు ఉండకుండా చూడాలన్నారు. ఆయనను కలిసిన వారిలో అబీబ్‌బిన్ మోసిన్ బాకుల్కా, ఖదీర్ తదితరులున్నారు.

దివ్యాంగులు కలిసికట్టుగా హక్కులు సాధించుకోవాలి



గోల్కొండ: దివ్యాంగులు కలిసికట్టుగా తమ హక్కులు సాధించుకోవాలని మజ్లిస్ యూత్ విభాగం నాయకుడు యాసర్ అరఫాత్ అన్నారు. మజ్లిస్ వికలాంగుల సంఘం గ్రేటర్ అధ్యక్షుడు జాహెద్ అలీ శనివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టాయన్నారు. దివ్యాంగుల కోసం స్వయం ఉపాధి పథకాలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



యాకుత్‌పురా: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ మీర్జా రహ్మాత్ బేగ్ టీజీ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారుఖీని కోరారు. శనివారం ఆయన విద్యుత్ సమస్యలపై సీఎండీ ముషారఫ్ అలీ ఫారుఖీతో తన కార్యాలయంలో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రహ్మాత్ బేగ్ మాట్లాడుతూ..యాకుత్‌పురా, రెయిన్‌బజార్, మదీనానగర్, యశ్రఫ్‌నగర్, భవానీనగర్, తలాబ్‌కట్టా ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలన్నారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలని సీఎండీకి వివరించామని ఆయన తెలిపారు.


ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి: రోహిణి


సరళదేవి, చక్రవర్తి దంపతులను సన్మానిస్తున్న డీఈఓ రోహిణి, రాజ్‌కుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని హైదరాబాద్ జిల్లా డీఈఓ ఆర్.రోహిణి అన్నారు. ప్రతి ఉద్యోగి తన విధుల నిర్వహణలో చేసిన మంచి ఎప్పటికి గుర్తుండి పోతుందని ఆ దిశగానే ప్రతి ఉద్యోగి పనిచేయాలని సూచించారు. శనివారం గన్‌ఫౌండ్రీలోని డీఈఓ కార్యాలయంలో టీపీస్టీటీస్ పాఠశాల విద్యాశాఖ విభాగం నగర అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ ఆడిటర్ సరళదేవి, ఎస్ఎస్ఏ సూపరింటెండెంట్ చక్రవర్తి పదవీ విరమణ వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగ్‌రావు, టీఎస్టీటీఎస్ పాఠశాల విభాగం నగర కార్యదర్శి ఎం.భాస్కర్, వి.డేవిడ్ పాల్గొన్నారు.

సన్మానం

అఫ్జల్‌గంజ్: నిజాయితీగా పని చేసే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని ఉస్మానియా ఆసుపత్రి అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి అన్నారు. 30 ఏళ్లుగా ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తించిన ఐదుగురు ఉద్యోగుల పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం ఉస్మానియాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు రాజేశం, నర్సింగ్‌రావు మరో ముగ్గురు ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ-1 డాక్టర్ శేషాద్రి, ఆర్ఎంఓలు డాక్టర్లు బండారి శ్రీనివాస్, విజయ్‌భాస్కర్, సాయిశోభ, సుష్మ సహాయ సంచాలకులు (పరిపాలన) నెహ్రూనాయక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

జాతీయ రహదారి.. చెత్తగా మారి..

పేరుకుపోతున్న వ్యర్థాలు..
కంపు కొడుతున్న పరిసరాలు
ఇబ్బందులు పడుతున్న బస్తీల వాసులు
స్పందించని అధికారులు


రహదారిలో నిలిచి ఉన్న స్వచ్ఛ్ ఆటోలు


రహదారిలో పైప్‌లైన్ నిర్మాణం పనులు

జియాగూడ: పురానాపూల్ చౌరస్తా నుంచి రాంసింగ్‌పురా వరకు గల జాతీయ రహదారిలో తీవ్రస్థాయిలో సమస్యలు నెలకొన్నాయి. పురానాపూల్ చౌరస్తా నుంచి మొదలైన 100 ఫీట్ల జాతీయ రహదారిలో పైప్‌లైన్ నిర్మాణం పనులు ఒక వైపు చెత్త డంపింగ్‌యార్డు, మేకల మండిల వల్ల రహదారి పూర్తిగా చెత్తమయంగా మారింది. దీంతో ఇరుపక్కల గల బస్తీల వాసులు ఇబ్బందులు పడుతూ గొడవలకు దిగడం సర్వసాధారణంగా మారిది. జియాగూడ రహదారి కూడా సమస్యలకు నిలయంగా ఉండడంతో ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారి గుండానే రాకపోకలు కొనసాగిస్తుండగా చెత్త డంపింగ్‌యార్డు, మేకలమండి కారణంగా ట్రాఫిక్ సమస్యతో అలస్యమవుతుంది. దీంతో ప్రయాణికులు సైతం సరైన సమయంలో తమ తమ గమ్యాలకు వెళ్లలేకపోతున్నారు. అత్తాపూర్ నుంచి హైకోర్టుకు వెళ్లే రహదారి ఇదే కావడంతో జడ్జీలు వెళ్లే సమయంలో ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అనంతరం పట్టించుకోవడం లేదు.

చెత్త డంపింగ్ యార్డుతో ఇబ్బందులు..

జాతీయ రహదారిలో చెత్త డంపింగ్‌యార్డు ఉండడం వల్ల జియాగూడ ఇతర సర్కిళ్లకు చెందిన స్వచ్ఛ్ చెత్త ఆటోలు డంపింగ్‌యార్డు ఇరుపక్కల గంటల తరబడి నిలిచి ఉంటున్నాయి. డంపింగ్‌యార్డు ఇన్‌చార్జి ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్వచ్ఛ్ ఆటోల సిబంది ఆరోపిస్తున్నారు. అలాగే స్వచ్ఛ్ ఆటోలు రోడ్డుపై నిలిపిన సమయంలో గాలికి చెత్త ఎగరడం, దుర్వాసన వెదజల్లడంతో న్యూ గంగానగర్, కేశవస్వామినగర్, నవోదయనగర్, దరియాబాగ్ వాసులు తరచూ గొడవలకు దిగుతున్నారు. చెత్త ట్రక్కులు రోడ్డుపై ఉండడంగో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. అలాగే మేకలమండికి వచ్చే వాహనాలు, భారీ లారీలు రోడ్డుపైనే నిలిపివేయడంతో రహదారిలో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది చాలదన్నాట్లు రహదారిలో మూడుచోట్ల వైన్స్‌లు, బార్‌లు ఉండగా మద్యంకు వచ్చేవారు వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు.

ఎంతకూ పూర్తికాని పైప్‌లైన్ నిర్మాణం పనులు..

జాతీయ రహదారిలో పైప్‌లైన్ నిర్మాణం పనులు సుమారు రెండేళ్ల నుంచి కొనసాగుతున్నాయి. ఎంతకీ పూర్తి కావడం లేదు. రహదారి పలు చోట్ల నిర్మాణం కారణంగా ట్రాఫిక్ మళ్లింపుతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని బస్తీలవాసులు కోరుతున్నారు.

నేడు విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత


ఆకుల శ్రీరాములు

చార్మినార్: ఈనెల 30న విద్యార్థులకు నోట్ బుక్స్, క్యాష్ అవార్డులు, స్కూల్ కిట్లను అందజేస్తున్నామని పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు తెలిపారు. ఇప్పటికే తమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించామని.. ఈ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఈనెల 16న జరిగిన కార్యక్ర మంలో ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. ఈ ఆదివారం హనుమాన్‌నగర్‌లోని సాయి కృప వసంత బంకేట్‌హాల్‌లో నిర్వహించే డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమానికి మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టుబోర్డు ట్రస్టీ డి.రాఘవేందర్‌తో పాటు ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ కార్యదర్శి జీపీ పాల్గున, మ్యాడం చంద్రకుమార్, ఆకుల పాండురంగారావు, మంద సూర్యప్రకాష్ పాల్గొంటారన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గోల్కొండ: ప్రీమియర్ ఆసుపత్రి సేవా కార్యక్రమాల భాగంగా ఈ నెల 30న ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ప్రీమియర్ ఆసుపత్రి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 30న సురంగల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. గైనిక్, డెండల్, కార్డియోలాజీ, ఆర్థోపెడిక్ తదితర విభాగాలతో పాటు ఫిజిషియన్స్ వైద్య సేవలు ఈ శిబిరంలో అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఈ వైద్య శిబిరం ఉంటుందన్నారు.

నేడు అల్లాదుర్గ్ శీలం కోట్ రేణుకా మాతకు ప్రత్యేక పూజలు



జియాగూడ: ఈ నెల 30న అల్లాదుర్గ్ శీలం కోట్ రేణుకా మాత పూజలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్‌కే సమాజ్ వర్కింగ్ యాక్టింగ్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ నగరి లక్ష్మీనారాయణ్, చైర్మన్ విశ్వనాథ్ ఆనంద్, వైస్ చైర్మన్ హసాజీ సురేష్‌లు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ..ఆదివారం సోమ వంశ సహస్రార్జున క్షత్రీయ సమాజ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పూజా కార్యక్రమానికి పెద్ద ఎత్తున సమాజ్ బంధువులు తరలిరావాలని కోరారు. అల్లాదుర్గ్ శీలం కోట్ రేణుకా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఎస్ఎస్‌కే సమాజ్ హైదరాబాద్ రహీంపురాలో 30న ఉదయం 6.30 గంటలకు బస్సులు బయల్దేరుతాయని తెలిపారు.

మూవీ ప్లానెట్‌లో చోరీ

గౌలిపురా: మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో మూవీ ప్లానెట్‌లో శనివారం చోరీ జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. చార్మినార్ బస్టాండ్ సమీపంలో మహ్మద్ షకీల్ (50) మూవీ ప్లానెట్‌ను నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి షాప్ మూసివేసి ఇంటికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు మూవీ ప్లానెట్‌లోకి వెనుక భాగం నుంచి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.50 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు చోరీ చేశారు. దీనిపై నిర్వాహకుడు మహ్మద్ షకీల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వీడ్కోలు



యాకుత్‌పురా: ప్రభుత్వ రంగా సెట్విన్ శిక్షణ సంస్థలో కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శనివారం పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సన్మానించి వీడ్కోలు పలికారు. సంస్థ ఎండీ వేణుగోపాల్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై పదవీ విరమణ పొందిన సుపరింటెండెంట్ పీబీఎస్ ప్రసాద్, ఉద్యోగులు తౌఫిక్, మహ్మద్ ఇబ్రహీం, శంషుద్దీన్, నర్మదా, లీలావతీ, మహ్మద్ ఖాసింను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ విభాగం అధికారి సురేష్ బాబు, మేనేజర్ మహ్మద్ అబ్దుల్ మోయిజ్, సుపరింటెండెంట్ రాధాకృష్ణ, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

జైగోమాటిక్ ఇంప్లాంట్స్‌పై అవగాహన


డాక్టర్ సునీల్ కోతావర్

అబిడ్స్: డెంటల్ ఇంప్లాంట్ల రంగంలో తీవ్రమైన దవడ ఎముక నష్టం ఉన్న రోగులకు జైగోమాటిక్ ఇంప్లాంటు ఒక ఆధునిక పరిష్కారమవుతుందని ఏఐఏడీ సొసైటీ అధ్యక్షుడు, ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ సునీల్ కోతావర్ పేర్కొన్నారు. సాధారణంగా ఇంప్లాంటు వేయడానికి బలమైన ఎముక అవసరమవుతుందన్నారు. కాని పైన దవడ తక్కువ ఎముక ఉన్న వ్యక్తులకు రెగ్యులర్ ఇంప్లాంట్లు వేయడానికి సవాళ్లు ఎదురవుతుండడంతో జైగోమాటిక్ ఇంప్లాంట్లు వేస్తున్నామన్నారు. శనివారం ఏఐఏడీ ఆధ్వర్యంలో జైగోమాటిక్ ఇంప్లాంట్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ కోతావర్ మాట్లాడుతూ..జైగోమాటిక్ ఇంప్లాంట్లు రెగ్యులర్ ఇంప్లాంట్ల కంటే పొడువుగా ఉంటాయన్నారు. జైగోమ ఎముక నుంచి సపోర్టు తీసుకోవడం ద్వారా దట్టంగా, స్థిరమైన పునాదిని ఇస్తుందన్నారు. సరైన నైపుణ్యం, సాంకేతిక పద్ధతులతో జై గోమాటిక్ ఇంప్లాంట్లు చిరునవ్వులను పునరుద్ధరిస్తాయని డాక్టర్ సునీల్ కోతావర్ పేర్కొన్నారు.

హైకోర్టు న్యాయవాది అమరేందర్‌రెడ్డికి డాక్టరేట్


డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న న్యాయవాది అమరేందర్‌రెడ్డి

అబిడ్స్: హైకోర్టు న్యాయవాది అమరేందర్ రెడ్డి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. భూపాల్‌లోని మానస సరోవర్ గ్లోబల్ యూనివర్సిటీలో కృత్రిమ మేధస్సులో చట్టపరమైన, నైతిక పరమైన చిక్కులు, కంపూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో డాక్టరేట్ సాధించారు. భూపాల్‌లో జరిగిన స్నాత్సకోత్సవ వేడుకల్లో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ చేతుల మీదుగా అమరేందర్‌రెడ్డి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ..ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధస్సుపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ సమస్యలన్నింటినీ అధిగమించడానికి ఏకీకృత అంతర్జాతీయ సాంకేతిక చట్టాలు ఏర్పాటు చేయడమే మార్గమన్నారు. డాక్టరేట్ పట్టా సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 2023 డిసెంబర్‌లో న్యూ ఢిల్లీలో జరిగిన ఆర్టిఫిషియన్ ఇంటెలీజెన్సీ అంతర్జాతీయ సదస్సుల్లో భారత ప్రధాని నరేంద్రమోదీ కూడా ఏకీకృత అంతర్జాతీయ సాంకేతిక చట్టాలు ఏర్పాటు చేయడం ఒక ప్రధాన మార్గమని పేర్కొన్నట్లు ఆయన గుర్తుచేశారు.

శిథిల భవనాల కూల్చివేత


దేవిబిన్‌బాగ్‌లో వాగ్వాదానికి దిగిన స్థానికులు

అబిడ్స్: జీహెచ్ఎంసీ అబిడ్స్-14 సర్కిల్ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేసేందుకు 14వ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు నడుం బిగించారు. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని బేగంబజార్, షహినాయత్ గంజ్, జాంబాగ్, గౌలిగూడ, సుల్తాన్‌బజార్, ఆగాపురా ప్రాంతాల్లో శిథిలావస్థకు చెందిన భవనాల నిర్వాహకులకు టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. సర్కిల్ పరిధిలో దాదాపు 30 భవనాలను గుర్తించారు. ఆయా భవనాలకు నోటీసులు కూడా జారీ చేసి కూల్చివేతను ప్రారంభించారు.

దేవిబిన్‌బాగ్‌లో వాగ్వాదం..

దేవిబిన్‌బాగ్‌లో పురాతన శిథిలావస్థకు చేరిన ఇళ్లను కూల్చివేసేందుకు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సయ్యద్ సైదుద్దీన్, సెక్షన్ అధికారి ముఖేష్ సింగ్ వెళ్లారు. స్థానికులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయలేకపోవడంతో కూల్చివేతలు ఆగిపోయాయి. అదనపు పోలీసు బందోబస్తుతో కూల్చివేతలు చేపడుతామని అధికారులు తెలిపారు.

'లబ్ధిదారులకు చెక్కులు ఎప్పటికప్పుడు పంపిణీ చేస్తున్నాం'

యాకుత్‌పురా: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు చెక్కులను పంపిణీ చేస్తున్నామని చార్మినార్ తహసీల్దార్ నిహారిక తెలిపారు. శనివారం డబీర్‌పురాలోని మండల కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. తమ మండల పరిధిలో ఇటీవల షాదీముబారాక్, కల్యాణలక్ష్మి పథకాలకు చెందిన చెక్కులను పంపిణీ చేశామన్నారు. 271 షాదీ ముబారక్, 8 కల్యాణలక్ష్మి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో పంపిణీ చేశామన్నారు. పాఠశాలల, కళాశాలలు ప్రారంభం కావడంతో కుల, నివాస, ఆధాయ ధ్రువీకరణ పత్రాలను విద్యార్థులకు ఎప్పటికప్పుడు జారీ చేస్తున్నామన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: మైత్రి నాట్యాలయ కూచిపూడి భరతనాట్యం పాఠశాల ఆధ్వర్యంలో సంస్థ నృత్య గురువు శిరిణికాంత్ శిష్యురాలు కట్టా వైష్ణవి కూచిపూడి నాట్య రంగప్రవేశం శనివారం రవీంద్ర భారతిలో కనుల పండువగా సాగింది. శ్రీ గణనాథం, ఓంకారిణి, తరంగం, జ్వలి, థిల్లాన, వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. వైష్ణవి రాబోయే రోజుల్లో మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ, తనికెళ్లభరణి తదితరులు

గన్‌ఫౌండ్రీ: అక్షజ్ఞ పబ్లికేషన్స్, హాస్యానందంల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ముళ్లపూడి వెంకటరమణ జన్మదిన వేడుకలను శనివారం గన్‌ఫౌండ్రీలోని స్టాన్లీ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన రాజకీయ బేతాల పంచ వింశతిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా హాస్యానందం పత్రిక నిర్వహించిన ముళ్లపూడి హాస్య కథల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సినీ నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు శివనాగేశ్వరరావు, బుల్లితెర నటులు జెన్ని, పొత్తూరి విజయలక్ష్మి, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, అప్పారావు సమన్వయ కర్త కళారత్న బ్నిం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



క్లాస్ లీడర్లుగా ఎంపికైన విద్యార్థులతో కల్నల్ రవీంద్రరావు, ప్రిన్సిపాల్ ఆరోగ్యమేరి దివ్య తదితరులు

విజయనగర్‌కాలనీ: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని కల్నల్ రవీంద్రరావు అన్నారు. శనివారం విజయనగర్ కాలనీ సెయింటాన్స్ బాలికోన్నత పాఠశాలలో క్లాస్ లీడర్లను ఎంపిక చేశారు. నూతనంగా ఎన్నికైన విద్యార్థులతో కల్నల్ రవీంద్రరావు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ఉన్నతమైన లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని వాటిని చేరేంత వరకు కృషి, పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సిస్టర్ ఆరోగ్యమేరి దివ్య, కరస్పాండెంట్ సిస్టర్ రోజి ఫ్రాన్సిస్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: ఇందిరాప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో 2024-2025వ విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులను అవర్లీ బేసిస్ మీద నియమించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వరలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్-07, అరబిక్-01, హిస్టరీ ఉర్దూ మీడియం-01, కామర్స్-03, బీబీఏ-01, బీబీఏ ఈ కామర్స్-01, కెమిస్ట్రీ-01, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్-06, స్టాటిస్టిక్స్-01, జువాలజీ-02 పోస్టులు ఖాళీ ఉన్నట్లు ఆమె తెలిపారు. పీజీలో కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు కలిగి ఉన్న వారు అర్హులని తెలిపారు. అలాగే సంబంధిత సబ్జెక్టులో నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. అభ్యర్థులు జులై 6న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖైరతాబాదుకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జులై 5వ తేదీలోగా తమ దరఖాస్తులను నాంపల్లిలోని ఇందిరాప్రియదర్శిని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వయంగా హాజరై సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో..

శాలిబండ: హుస్సేనీఆలంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో వివిధ సబ్జెక్టులను బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సునీత పద్మావతి తెలిపారు. జులై 3వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. జులై 6న ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డెమో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. అరబిక్-1, తెలుగు-1, ఇంగ్లిష్-3, ఈ కామర్స్-3, మోడ్రన్ లాంగ్వేజ్ (యుఎం)-1, కామర్స్-3, కంప్యూటర్ సైన్స్-4, మ్యాథమెటిక్స్-1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టుల కోసం పీజీలో 50 శాతం మార్కులతో బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి ఆహ్వానం

చార్మినార్: 2024-25 సంవత్సరానికి గాను ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్)లో 38 తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను జులై 2వ తేదీ లోపు కళాశాలలో సమర్పించాలన్నారు. అరబిక్-01, ఇంగ్లిష్-08, సంస్కృతం-01, ఎకనమిక్స్-02, హిస్టరీ-02, పొలిటికల్ సైన్స్-02, కామర్స్-05, బీబీఏ-03, బీసీఏ-02, కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్స్-06, మేథమెటిక్స్-02, ఫిజిక్స్-01, స్టాటిస్టిక్స్-01, అప్లైడ్ న్యూట్రిషన్-01, బయో టెక్నాలజీ-01 పోస్టులకు గాను పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని, పీహెచ్‌డీ, యం.ఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఇతర వివరాలకు డి.శ్రవణ్ కుమార్ (98482 74530)ను సంప్రదించవచ్చు.